అన్నదాతకు కోతమిషన్ల కొరత

- వరికోతలు ఊపందుకోవడంతో మిషన్లకు పెరిగిన డిమాండ్
- ఇతర రాష్ట్రాల నుంచి వరికోత యంత్రాలు వస్తున్నా తప్పని నిరీక్షణ
- వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్న రైతులు



జాజిరెడ్డిగూడెంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేను

అర్వపల్లి : అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే వరకు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి పంట చేతికొచ్చే సమయంలో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు వర్షాలు పడ్డాయి. దీంతో కొంత పంట దెబ్బతింది. అయితే మిగిలిన పంట కోయిద్దామన్నా వరికోత మిషన్లు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వరికోత మిషన్లు ఈ ప్రాంతానికి కోతల కోసం వచ్చాయి. కానీ మిషన్లు సకాలంలో దొరకక రైతులు వరిచేలు కోయించడానికి అవస్థల పాలవుతున్నారు. మిషన్ల కోసం తిరుగుతున్నారు. మళ్లీ వర్షాలు పడితే ఉన్న కాసింత పంట కూడా నేలరాలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 22వేల ఎకరాల్లో వరిపంట సాగయింది. ఇందులో దాదాపు 80శాతం వరిచేలు కోతకు వచ్చాయి. మిగిలినవి మరో వారం, పది రోజుల్లో కోతకు రానున్నాయి. అయితే కోతకు వచ్చిన వాటిలో సుమారు 6వేల ఎకరాలు మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయి. మిగిలిన చేలు కోత మిషన్లు దొరకక ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మిషన్ల వద్ద రైతులు రోజుల తరబడి వేచి ఉంటున్నారు. వరికోత మిషన్ల యజమానులు గంటకు రూ.2వేల నుంచి రూ.2,500 వరకు తీసుకుంటున్నారు. అయినా మిషన్లు దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెండు ఎకరాల వరి చేను కోయించాల్సి ఉంది



రెండు ఎకరాల వరిచేను కోయించాల్సి ఉంది. వరికోత మిషన్ కోసం తిరుగుతున్నాను. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వరికోత మిషన్లు వస్తున్నా చాలడం లేదు. వరి కోత మిషన్ల కొరతను తీర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నీలం రామకృష్ణ, రైతు, అర్వపల్లి

మిషన్ కోసం ఎదురుచూస్తున్నా



వరిచేను కోయించడానికి కోత మిషన్ కోసం వారం రోజులుగా ఎదురుచూస్తున్నాను. మిషన్ దొరకక వరిచేను కోయించడం ఆలస్యమవుతోంది. ఇప్పటికే వర్షంతో కొంత పంట నేలకొరిగి దెబ్బతింది. మళ్లీ వర్షాలు వస్తే ఉన్న పంట కూడా చేతికందని పరిస్థితి నెలకొంటుంది.

– మెరుగు మధు, జాజిరెడ్డిగూడెం

విద్యా వ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్



బాలికల వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి పేద విద్యార్థుల కోసం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచి వారికి అండగా నిలిచారని తెలిపారు. తాను కూడా వసతి గృహంలో చదివి ఎమ్మెల్యేను అయ్యానని, హాస్టల్ విద్యార్థుల కష్టాలు తెలిసిన వ్యక్తిని అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు 40శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడం హర్షణీయమని తెలిపారు. పేపర్ బాయ్ స్థాయి నుంచి అత్యున్నత రాష్ట్రపతి పదవిని అందుకున్న భారతరత్న అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి రానున్న రోజుల్లో విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకురానున్నారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఐటీఐ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రాంత విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం వెలుగుపల్లి సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, ఎంఈఓ బోయిని లింగయ్య, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్దన్, చింతకుంట్ల వెంకన్న, దాసరి శ్రీను, శంకర్, వెంకన్న, మల్లేష్, నాగయ్య, అంజయ్య, నాగరాజు, జలేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నాగారంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాగారంలో శనివారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు మోదాల విజయ్ మాట్లాడారు. గత 16ఏళ్లుగా ఎన్నడూ లేని విధంగా 40శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సీఎం నిర్ణయంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందని తెలిపారు. 10ఏళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పత్తెపురం రాజీ, నాతి శ్రీను, గంట నవీన్, కన్నెబోయిన నాగరాజు, శీల రవీందర్, గద్దల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం

సూర్యాపేటటౌన్ : గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించడం పట్ల టీఎస్ యూటీఎఫ్ ఐక్య గురుకులాల జిల్లా వేదిక కన్వీనర్ భరత్ పయ్యావుల శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లలో గురుకులాలు, జనరల్ హాస్టళ్లలో పౌష్టికాహారం అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన



అన్నారంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : ఐకేపీలలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నారంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా దొడ్డు రకం ధాన్యానికి బోనస్ రూ.500 చెల్లించాలని అన్నారు. సన్న ధాన్యం, దొడ్డు ధాన్యానికి వేరువేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఐకేపీల్లో కాంటాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఐకేపీ కేంద్రాలకు మిల్లులను కేటాయించి, వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దొంగరి శ్రీనివాస్, బెడిద రాములు, మట్టపల్లి వెంకట్, కాడారి దాస్, సోమశేఖర్, ప్రవీణ్, వెంకన్న, సోమయ్య, ఇషాకర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ఇబ్బందులు తీర్చాలని వినతి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యోగానందచారి

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సొంత పార్టీ నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ గెలుపుకోసం కష్టించి పనిచేసిన వారిని పక్కన పెడుతున్నారని విమర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని గతంలో ముందు ప్రకటించిన విధంగానే బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు పాలకుర్తి రాజయ్య కుటుంబీకులకు ఇవ్వాలని మహేష్‌కుమార్‌గౌడ్‌ను కోరినట్లు తెలిపారు. అయితే సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, రత్నం సంతోష్ పాల్గొన్నారు.

రూ.2.50లక్షల ఎల్‌ఓసీ అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన రాసూరి ఏకస్వామి ఇటీవల విద్యుదాఘాతంతో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వైద్యఖర్చుల కోసం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి ద్వారా భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించాలని దరఖాస్తు చేశారు. దీంతో రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎల్‌ఓసీ కాపీని శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి ఏకస్వామి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, కాసర్లపహాడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోదాడ డీఎస్పీకి సన్మానం

కోదాడరూరల్ : కేంద్ర హోం మంత్రి దక్షతా పురస్కారానికి ఎంపికైన కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డిని శనివారం కోదాడలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు భాషబోయిన భాస్కర్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నేర పరిశోధనలో ఆయన చూపిస్తున్న ప్రతిభకు ఈ అవార్డు రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు మూసి శ్రీనివాసరావు, టి.రామయ్య, చారగండ్ల సత్తయ్య, తమ్మనబోయిన వీరబాబు, చాపల శ్రీను, అల్లి వీరబాబు, వెంకన్న, చిలక రమేష్, నాగరాజు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి దంతాల అనూష విద్యాభివృద్ధి కోసం గ్రామానికి చెందిన ఎనుగుతల చంద్రయ్య–వసంత కుటుంబ సభ్యులు శనివారం ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన అనూష ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. పేద విద్యార్థి విద్యాభివృద్ధి కోసం తమ వంతుగా రూ.10వేల నగదును అందించినట్లు వారు తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సీపీఎం



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

మద్దిరాల : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పోరాడే పార్టీ సీపీఎం మాత్రమే అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల తృతీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఎం బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, చెరుకు యాకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, బుర్ర శ్రీనివాస్, మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, పులోజు సైదులు, మద్దెల కోటయ్య, పాల్వాయి కవిత, దీకొండ ఉపేందర్, బద్దం మల్లారెడ్డి, దీకొండ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే పేరుతో బడులు మూసివేయడం సరికాదు



మాట్లాడుతున్న రేపాక లింగయ్య

సూర్యాపేటటౌన్ : సర్వే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో మాత్రమే నిర్వహించడం, మధ్యాహ్నం పూట సెలవు ప్రకటించడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బలోపేతం చేయాల్సిన ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడం మూలంగా ఉన్నత పాఠశాలల్లో నమోదు తగ్గుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఇళ్లలో ఎవరు ఉండరని, సర్వేకు ఇది అనుకూల సమయం కాదని చెప్పారు. ఉదయం పూట సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్వే నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయిస్తే మంచిదన్నారు. సాధ్యం కాకపోతే ప్రతి పాఠశాల నుంచి 50 శాతానికి మించకుండా ఉపాధ్యాయులను ఉదయం 7నుంచి 11వరకు సర్వేకు ఉపయోగించుకొని తిరిగి స్కూల్‌కు వచ్చేలా చేసి బోధనకు ఆటంకం కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వి. రావ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం. దశరథ రామారావు, పి. వెంకటేశ్వర్లు, కె. యోగానంద్, జిల్లా ఉపాధ్యక్షులు కె. వేణు, జె. రమణ, జిల్లా కార్యదర్శులు సిద్దిఖ్ పాషా, టి. ప్రభాకర్, బి. క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు



పోలుమల్లలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దిరాల : ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం పోలుమల్ల గ్రామంలో 365 జాతీయ రహదారికి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. భవనంలో పెట్టిన హోటల్‌ను, నేమ్ బోర్డులను తొలగించారు. మూడు రోజులలో భవనాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

పెన్‌పహాడ్ : ఈ నెల 7న మండల పరిధిలోని లింగాల గ్రామంలో జరిగే సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 1996లో సీపీఎం నుంచి మొదటిసారిగా ఎంపీపీ అయిన నల్లపు రామాంజమ్మ–శ్రీను దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఎం అన్నారు. తెలిసో తెలియకో పార్టీని వీడిన పూర్వ కమ్యూనిస్టులందరూ తిరిగి మాతృ పార్టీలో చేరాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాడక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, గుంజా వెంకటేశ్వర్లు, మద్ది అంజిబాబు, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాసం పూజలు ప్రారంభం



అర్వపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : కార్తీకమాసం వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. కార్తీక మొదటి శనివారం సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడాయి. అర్వపల్లిలోని ఆలయంలో పంచామృతాభిషేకం, తులసి అర్చన, సహస్ర నామార్చన, నక్షత్రనీరాజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నూతనకల్ : ఎర్రపహాడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్, అధికారులు



పెన్‌పహాడ్ : యల్లప్పకుంట తండాలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



అర్వపల్లి : రామన్నగూడెంలో ఇంటికి స్టిక్కర్ వేస్తున్న ఎన్యూమరేటర్ పుష్ప

నూతనకల్ : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం ఎర్రపహాడ్‌లో కుటుంబాల గుర్తింపు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబ సమగ్ర సర్వే వివరాలను ఎలాంటి తప్పిదాలు లేకుండా పొందుపర్చాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం మండలంలోని గూడెపుకుంట తండా, దూపహాడ్ గ్రామాల్లో ఇంటి నంబర్లు వేసే ప్రక్రియను తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటి నంబర్ల ప్రకారం ప్రతి ఎన్యూమరేటర్ 150 నుంచి 175 ఇళ్లు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు సంద్యాల వినోద్, అల్లాడి సత్యనారాయణగౌడ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ సంఖ్యను నిర్ధారించాలి

అర్వపల్లి : కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి ఇంటి సంఖ్యను నిర్ధారించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. ఇంటింటి సర్వేకు సంబంధించి కుటుంబాలను నిర్ధారించుటకై శనివారం రెండో రోజు ఇళ్లకు స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 10,120 కుటుంబాల సర్వే జరుగనుందని చెప్పారు. దీనికి సంబంధించి 17 పంచాయతీలను 98 ఎన్యూమరేషన్ బ్లాకులుగా విభజించి, ఎన్యూమరేటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో ఎన్యూమరేటర్ 100 నుంచి 175 వరకు ఇళ్లను సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి ఇంటింటి సర్వే మొదలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా కల్వర్టులు



అర్వపల్లి శివారులోని కల్వర్టులో పడేసిన చెత్త



సీతారాంపురం వద్ద..

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై నిర్మించిన వరద నీటి కల్వర్టులు చెత్త, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. స్థానిక వ్యాపారులు, తోపుడు బండ్ల యజమానులు, హోటళ్లు, దుకాణాల యజమానులు చెత్త, వ్యర్థాలను తీసుకెళ్లి ఈ కల్వర్టుల్లో పారవేస్తున్నారు. చెత్తాచెదారం మూలంగా వరద నీళ్లు బయటకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా కల్వర్టుల్లో వ్యర్థాలు, చెత్తను వేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాలధారులకు అన్నదానం

మునగాల : మునగాల మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 225 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఛైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మునగాల గ్రామానికి చెందిన బొబ్బిలి సంజీవరెడ్డి –శిరీష దంపతులు, గణపవరం గ్రామానికి చెందిన దాసరి గురులింగం, తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బూచిపల్లి సైదిరెడ్డి –అనూష దంపతులు, పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన చిట్యాల ఉపేందర్‌రెడ్డి –జ్యోతి దంపతులు సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్ల సురేష్, కొమ్ము ఈదారావు, బొబ్బిలి సంజీవరెడ్డి, దాతలు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

మునగాల : మండలంలోని విజయరాఘవపురంలో శనివారం ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాదిగ, ఉపాధ్యక్షుడిగా సాంపంగు వినోద్, ప్రధాన కార్యదర్శిగా రెమిడాల రాజేష్, కార్యదర్శులుగా కత్తి నాగయ్య, రెమిడాల వంశీ, సహాయ కార్యదర్శిగా సాంపంగు సాయికిరణ్, కోశాధికారిగా కొత్తపల్లి నర్సయ్య, ప్రచార కార్యదర్శులుగా రవితేజ, సిద్దెల సిద్ధు, కత్తి వేణులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ నల్లగొండలో ఈనెల 4న జరిగే ధర్మయుద్ధ మహాసభకు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు, అంబేద్కర్ యువజన సంఘం గౌరవ సలహాదారులు రెమిడాల లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కత్తి కోటయ్య పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా లక్ష్మణ్



అర్వపల్లి : బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చెరుకుపల్లి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. శనివారం అర్వపల్లిలో ఈ ఎన్నికను నిర్వహించారు. లక్ష్మణ్ మండల అధ్యక్షుడిగా కూడా పని చేశారు. తన ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు చెరుకు కిరణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కొంగరి బాలరాజు, స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, రావన్, నాగరాజు, ఉపేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కమిటీ ఎన్నిక



సాల్మన్

మద్దిరాల : టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గంపాల సాల్మన్, ఉపాధ్యక్షులుగా కోడెపాక మల్లికార్జున్, పొన్నాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గంగాధర సురేష్ కుమార్, కార్యదర్శులుగా పి.రాజేంద్రప్రసాద్, బి.మురళి, డి.సరిత, ఎస్.జ్వాలా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పుష్పాల వీరన్న, ఎస్‌కే.ఎం.సుభాని, టి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు వెంకన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి మృతదేహానికి డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, నర్సింగ కృష్ణమూర్తి, కొమిరెల్లి, మామిడి సత్యనారాయణ, సోమయ్య, మధు, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, రవీందర్, లింగయ్య, కృష్ణమూర్తి, వెంకన్న, సోమయ్య, భీముడు, సైదులు, ఖాజ, రాంబాబు, సందీప్ ఉన్నారు.

టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడిగా నరేష్



నాగారం : టీపీసీసీ సాంస్కృతిక సేన తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన వంగూరి నరేష్‌ను నియమిస్తూ టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వంగూరి నరేష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, నాయకులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


పశువులకు టీకాలు



అడివెంలలో టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలను పాడి రైతులు తమ పశువులకు తప్పకుండా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్ కోరారు. మండల పరిధిలోని అడివెంల గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్.పద్మ, గోపాలమిత్రలు అల్దాస్ లింగయ్య, అర్జున్, యాకయ్య పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని గెలిపించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మోతె : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ మోతె మండల నాయకులు కోరారు. శనివారం మండలంలోని సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.లాలు, మండల ప్రధాన కార్యదర్శి డి.నరేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, మారయ్య, రాంబాబు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.